## క్లుప్తంగా

### వసతి గృహంలో వివాహితకు ఆశ్రయం



మహిళా షెల్టర్‌లో బాధితురాలు

సీతమ్మధార: అన్నవరానికి చెందిన వివాహిత లలిత ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. దిక్కుతోచని స్థితిలో రైల్వే స్టేషన్‌లో ఉండగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) పోలీసులు గుర్తించారు. తక్షణమే స్పందించిన ఆర్‌పీఎఫ్ పోలీసులు, ఆమెకు సహాయం అందించేందుకు ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఏయూటీడీ సిబ్బంది మహిళా షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయిని సంప్రదించగా, ఆమె తక్షణమే రైల్వే స్టేషన్‌కు చేరుకుని లలితను తమ సంరక్షణలోకి తీసుకున్నారు. అనంతరం లలితకు సీతమ్మధారలోని టి.యస్.ఆర్ కాంప్లెక్స్‌లో గల మహిళా వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. అక్కడ ఆమెకు భోజనం, వసతి కల్పించారు.

### నేడు సీతారాముల 16 రోజుల పండగ



పూజలందుకుంటున్న శ్రీ సీతారామలక్ష్మణమూర్తులు

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో శ్రీ సీతారాముల 16 రోజుల పండగ సోమవారం నుంచి ప్రారంభం కానుందని ఆలయ అర్చకుడు భార్గవ శర్మ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం ముత్తైదువులకు తాంబూలాలు అందజేయనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సీతారాముల వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

### 'సేవా' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: శక్తి ఎంపవరింగ్ ఉమెన్ అసోసియేషన్ (సేవా) ఆధ్వర్యంలో ఆదివారం దాబాగార్డెన్స్‌లోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా ప్రతినిధి పైడి రజని మాట్లాడుతూ, రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. వారి స్నేహితులు పద్మ, అపూర్వ, శ్రావ్య, కిరీటీ, చంద్రమౌళి, నరేంద్ర, డాక్టర్ శ్రీనివాసులు, రమణరాజు, ఉదయ్‌లతో పాటు పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ శిబిరంలో మొత్తం 25 యూనిట్ల రక్తాన్ని సేకరించగలిగామని ఆమె తెలిపారు.

### ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న చిన్నారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామంలో జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. జ్యోష్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం బుజ్జి గణపతి నృత్యాంశంతో ప్రారంభమైంది. జై జనార్ధన, ఐగిరి నందిని నృత్య రూపకాలు ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదిగో అల్లదిగో, ముద్దుగారే యశోద వంటి అన్నమయ్య కీర్తనలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పవిత్ర, మోక్షజ్ఞాన, లక్ష్మీప్రణతి, జాస్మిక, గాతామిత్క తదితర కళాకారులు పాల్గొన్నారు. మురళీగోవింద్ నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి ఏటీ రమణ పర్యవేక్షించారు.

# బోరుమంటున్నాయ్

**అల్లిపురంలో నిరుపయోగంగా చేతిపంపులు**

**పట్టించుకోని జీవీఎంసీ అధికారులు**

**అల్లిపురం: వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో దక్షిణ నియోజకవర్గంలోని జోన్–4 పరిధిలో చాలా చోట్ల చేతి పంపులు(బోర్లు) నిరుపయోగంగా** మారాయి. ముఖ్యంగా 32, 33, 34 వార్డుల్లో అనేక వీధి బోరింగ్‌లు మరమ్మతులకు గురై పని చేయడం లేదు. కొన్ని చోట్ల బోరింగ్‌లు పనిచేస్తున్నప్పటికీ, వాటి బేస్‌మెంట్లు శిథిలావస్థలో ఉండటంతో నీళ్లు నింపడానికి వీలు లేకుండా ఉంది. మరికొన్ని చోట్ల హ్యాండిల్స్ పని చేయక నిరుపయోగంగా పడి ఉన్నాయి. పనిచేయని బోరింగ్‌లకు తక్షణమే మరమ్మతులు చేయాలని, శిథిలమైన బేస్‌మెంట్‌లకు కొత్త సిమెంట్ దిమ్మలు నిర్మించాలని స్థానికులు వేడుకుంటున్నారు. అలాగే, పనిచేయని హ్యాండిల్స్‌ను వెంటనే బాగు చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.



బంగారుమెట్ట సచివాలయం వద్ద..



కంఠంవారివీధిలో..



అల్లిపురం మెయిన్‌రోడ్డు మోడల్ స్కూల్ వద్ద..

**బోరు పని చేయడం లేదు**

బంగారుమెట్ట సచివాలయం వద్ద గల బోరు చాలా కాలంగా పని చేయడం లేదు. పలుమార్లు జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఉన్న బోర్లు తుప్పుపట్టి పోతున్నాయి. వాటిని బాగు చేయిస్తే వేసవిలో నీటి ఎద్దడి తగ్గుతుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె. శిరీష, బంగారుమెట్ట కాలనీ.

**చాలా కాలంగా నిర్లక్ష్యం**

కొబ్బరితోటలోని పోలమాంబ అమ్మవారి ఆలయం వద్ద బోరు అందరికీ ఉపయోగకరంగా ఉండేది. ఇది మరమ్మతులకు గురి కావడంతో చాలా కాలంగా వినియోగించడం లేదు. జీవీఎంసీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. బోరుకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి

– ఉమ్మిడి ఎల్లయ్యమ్మ, కొబ్బరితోట



కొబ్బరితోట పోలమాంబ గుడి వద్ద మరమ్మతులకు గురైన బోరు



జెండా చెట్టు వద్ద నిరుపయోగంగా పడి ఉన్న బోరు



బంగారుమెట్ట గ్రంథాలయం వీధిలో..



75 ఫీట్ రోడ్డులో ...

**ఎండాకాలంలో ఆసరాగా ఉంటాయి**

పాడైన బోర్లకు మరమ్మతులు చేస్తే ఎండాకాలంలో నీటి ఎద్దడి లేకుండా ఉంటుంది. వీధి కుళాయిలు రాని సమయంలో బోరు నీటినే అంతా వాడుకుంటాం. కొత్తవి వేయమని కోరడం లేదు కదా. ఉన్న వాటికే మరమ్మతు చేసి అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలని కోరుతున్నాం. – ఎం.శ్రీలక్ష్మి, చెరువుగట్టు

# ఘనంగా ఈస్టర్ వేడుకలు

- ఏసుక్రీస్తు పునరుత్థాన జాగరణలు
- ఆర్చి బిషప్ డాక్టర్ బాలశౌరీరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



క్రీస్తు ప్రార్థనల్లో చిన్నారులు



క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న అగ్రపీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ ఉడుముల బాలశౌరీరెడ్డి

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా నిర్వహించే పాస్కా(ఈస్టర్) ఉత్సవాన్ని జ్ఞానాపురం రక్షణగిరిలో సెయింట్ పీటర్స్ పునీత పేతురి ప్రధాన దేవాలయం విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, పారిష్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్ అధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారని, గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు అంటే శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటకు వస్తారని క్రైస్తవులు నమ్మకంగా విశాఖ అపోస్తలిక్ పాలనాధికారి, విశాఖ అతిమేత్రాశనం అగ్రపీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ ఉడుముల బాలశౌరీరెడ్డి అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరిలో పునీత పేతూరు రాయప్ప దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో జాగరణ, దివ్యపూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. రక్షణగిరిని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దివ్యపూజా బలులు సమర్పించారు. గురువులు ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ అంథోనిరాజ్ ప్రత్యేక ప్రార్థనల్లో పరిశుద్ధ జలమును అభిషేకించారు. క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచే ఘటనను చూపిస్తూ ప్రదర్శించిన భారీ సెట్టింగ్, చిన్నారులు ప్రదర్శించిన పలు కార్యాక్రమాలు ఆహూతుల్ని ఆకట్టుకున్నాయి. పారిస్ పాస్టల్ కౌన్సిల్( పీపీసీ) సభ్యులు పనులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలిండియా కేథలిక్ యూనియన్ జాతీయ కార్యదర్శి బీవీఆర్ శేషుబాబు, హేమాల విజయకుమార్, బేతా జోసెఫ్, శ్యామలరావు తదతరులు పాల్గొన్నారు.

## క్రీస్తు బోధనలు అనుసరణీయం



డాక్టర్ రమణమూర్తిని సన్మానిస్తున్న చర్చి సంఘం సభ్యులు

సీతమ్మధార: ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని దక్షిణ నియోజకవర్గంలోని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తిని చర్చి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. నగరంలోని భానునగర్ సియోన్ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ శివశంకర్ లాజరస్ ఆధ్వర్యంలో డాక్టర్‌ను శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ శిలువ వేయబడిన ఏసుక్రీస్తు మళ్లీ ఈ లోకంలోకి అడుగుపెట్టిన పర్వదినమే ఈస్టర్ అని గుర్తు చేశారు. క్రీస్తు బోధనలు మానవాళికి ఆదర్శప్రాయమన్నారు. చర్చి సభ్యుల ఆధ్వర్యంలో క్రీస్తు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో చర్చి సంఘం సభ్యుడు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 15 ఏళ్ల తరువాత ఇంటికి చేరిన సిద్ధయ్య



సిద్ధయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

సీతమ్మధార: సీతమ్మధార: సుమారు రెండేళ్ల క్రితం రైల్వే స్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో, అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న సిద్ధయ్య అనే మానసిక రోగిని ఏయూటీడీ సిబ్బంది రక్షించారు. అప్పటికే 13 ఏళ్లుగా ఒంటరిగా తిరుగుతూ వైజాగ్ చేరుకున్న అతనికి ఏయూటీడీ ఆశ్రయం కల్పించింది. కర్ణాటక రాష్ట్రం, తుమకూరు జిల్లాలోని బుక్కపట్నంకు చెందిన సిద్ధయ్య అక్కడ వ్యవసాయం చేస్తూ జీవనం గడిపేవాడు. అతని తల్లి కూడా మానసిక సమస్యలతో బాధపడేది. కొన్నాళ్లకు సిద్ధయ్యకు మానసిక వ్యాధి తీవ్రమైంది. దీంతో ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అలా విశాఖ చేరుకున్న సిద్ధయ్యను ఏయూటీడీ సిబ్బంది చేరదీసి, ప్రభుత్వ మానసిక వైద్యశాలలో మెరుగైన చికిత్స అందించారు. అనంతరం అతన్ని ఏయూటీడీ షెల్టర్‌కు తరలించారు. సిద్ధయ్య పూర్తిగా కోలుకున్నాడని నిర్ధారించుకున్న తర్వాత, ఏయూటీడీ సిబ్బంది సిద్ధయ్య వివరాలు తెలుసుకుని అతని స్వగ్రామానికి తీసుకెళ్లారు. బుక్కపట్నంలో ఆయన సోదరుడు రంగరాజుకు క్షేమంగా అప్పగించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు చెప్పారు.

# భీమిలి తీరంలో రంగుల తెప్పల సందడి



తీరానికి వస్తున్న రంగుల తెరచాప తెప్పలు



భీమునిపట్నం: భీమిలి తీరం ఆధునిక మత్స్యకార పడవలతో సందడిగా ఉన్నప్పటికీ, తెడ్ల సాయంతో తెప్పలపై చేపల వేట సాగించే మత్స్యకారులు ఇప్పటికీ ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. గతంలో పడవలు, తెప్పలు ప్రధాన వేట సాధనాలుగా ఉన్న సమయంలో, మత్స్యకారులు తెడ్ల సాయంతోనే సముద్రంలోకి వెళ్లి తిరిగి వచ్చేవారు. ఆ సంప్రదాయ ఆనవాళ్లు నేటికీ భీమిలి తీరంలో కనిపిస్తున్నాయి. యాంత్రిక బోట్లపై ప్రస్తుతం వేట నిషేధం అమల్లో ఉన్నప్పటికీ, తెప్పలతో వేటాడే వారికి ఈ నిబంధన వర్తించదు. దీంతో చాలా మంది మత్స్యకారులు తమ జీవనోపాధి కోసం ఇప్పటికీ తెప్పలనే నమ్ముకున్నారు. ఒక్కో తెప్పకు ఒక్కో రంగు తెరచాప ఉండటం తీరానికి ప్రత్యేకమైన అందాన్నిస్తుంది. సముద్రపు నీలి రంగు నేపథ్యంలో ఈ రంగుల తెరచాపలు కనువిందు చేస్తున్నాయి.

## ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతులు ఇస్తున్న భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం చైత్ర మాస శుద్ధ సప్తమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండ శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50ల ప్రత్యేక దర్శన కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు అవసరమైన సౌకర్యాలను పర్యవేక్షించారు.

## ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక దినోత్సవం



ఏఐబీఈఏ రూపకర్తలకు నివాళులర్పిస్తున్న నాయకులు

దాబాగార్డెన్స్: జిల్లా బ్యాంక్ ఉద్యోగ సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దినోత్సవం ఆదివారం డాబాగార్డెన్స్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఎల్ఐసీ బ్రాంచ్ వద్ద ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు కోటేశ్వరరావు, సాత్యకి ప్రసాద్, శంకర రాజు, వసంతరావులు జెండాను ఎగురవేశారు. అనంతరం ఏఐబీఈఏ రూపకర్తలైన ప్రభాత్కర్, పర్వానా, తారకేశ్వర్ చక్రవర్తి , చెడ్డా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ ఏఐబీఈఏ యూనియన్ ఏర్పడిన చారిత్రక నేపథ్యం, ఇప్పటివరకు జరిగిన ముఖ్యమైన సంఘటనలు, యూనియన్ గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో విజేతలైన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈత ప్రసాద్, ఆదారి శ్రీను, ఈశ్వర్, రమేష్, పి.ఎస్. రావు, గురుమూర్తి, రవి, స్వాతితో పాటు పలువురు బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

# దివ్యాంగుడి ఆత్మహత్య

పీఎం పాలెం: పీఎం పాలెం సెకండ్ బస్టాప్ సమీపంలోని తిరుమల అపార్ట్‌మెంట్‌లోని నాలుగో అంతస్తులో నివసిస్తున్న దివ్యాంగుడు నియమాన సుభాష్ చంద్రబోస్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పీఎం పాలెం సీఐ బాలకృష్ణ మీడియాకు తెలిపారు. సుభాష్ చంద్రబోస్ తండ్రి 2023లో మృతి చెందగా, తల్లి, సోదరుడు కూడా గతంలో చనిపోయారు. దీంతో చంద్రబోస్ ఒంటరిగా జీవిస్తున్నారు. సుభాష్ చంద్రబోస్‌కు శ్రీకాకుళానికి చెందిన ధనుంజయరావు అనే స్నేహితుడు ఉన్నాడు. వారిద్దరూ తరచూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఆదివారం ఉదయం ధనుంజయరావు సుభాష్ చంద్రబోస్‌కు ఫోన్ చేయగా, ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. ఎంత ప్రయత్నించినా ఫోన్ కలవకపోవడంతో అపార్ట్‌మెంట్ ఓనర్‌కు సమాచారం అందించాడు. అపార్ట్‌మెంట్ ఓనర్ వాచ్‌మన్‌కు తెలియజేయగా, ఆదివారం మధ్యాహ్నం 1 గంటల సమయంలో కొంతమంది అపార్ట్‌మెంట్ వాసులు బలవంతంగా తలుపులు తెరిచి చూడగా, సుభాష్ చంద్రబోస్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో మృతుడు గతంలో కూడా ఆత్మహత్యా ప్రయత్నం చేశాడని తేలింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుని స్నేహితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉత్సాహంగా వేసవి శిక్షణ

మద్దిలపాలెం: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం ఎదురుగా గల ఫంక్షన్ హాల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. కంచరపాలెం బి.ఎస్.ఆర్.ఫౌండేషన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ నాయకుడు శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు. రోజూ మనం ఉపయోగించే వస్తువులు, మన చుట్టూ ఉన్న వాటితో సైన్స్ ప్రయోగాలు చేసి చూపించి, పిల్లలకు నేర్పించారు.

## అన్నమాచార్య సంకీర్తనలతో శ్రీనివాసుని కటాక్షం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తనా పోటీలు నిర్వహించారు. కప్పరాడ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు జి.శేషాచార్యులు జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలు ఎవరైతే భక్తితో గానం చేస్తారో వారికి శ్రీనివాసుని కటాక్షం లభిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు భక్తిని కూడా అలవర్చుకోవాలని సూచించారు. ఐదు విభాగాల్లో జరిగి న పోటీలో నగరానికి చెందిన 180 మంది విద్యా ర్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి వంకాయల సన్యాసిరాజు, సంస్థ గౌరవాధ్యక్షుడు కె.ఎ.రాజు, అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కన్వీనర్ సి.హెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, వి.నాంచారయ్య, పీవీఎస్‌వీ ప్రసాద్, అరుణకాంత్ పాల్గొన్నారు.

# లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు



ఆరిలోవ లాడ్జీలో యువకుడి బ్యాగు తనిఖీ చేస్తున ఎస్ఐ కృష్ణ



రుషికొండ లాడ్జీలో యువకుడి ఆధార్ కార్డు పరిశీలిస్తున్న ఎస్ఐ రాందాస్

ఆరిలోవ: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆరిలోవ పోలీసులు శనివారం అర్ధరాత్రి లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జీలన్నింటిలోనూ సీఐ హెచ్.మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో లా అండ్ ఆర్డర్ ఎస్ఐలు కృష్ణ, రాందాస్, ఏఎస్ఐలు మూడు బృందాలుగా విడిపోయి తనఖీలు నిర్వహించారు. శ్రీకాంత్‌నగర్, చినగదిలి, పెదగదిలి, హనుమంతవాక, విశాలాక్షినగర్, ఆదర్శనగర్, సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లోని 17 లాడ్జీలకు పోలీసులు వెళ్లి.. అక్కడ ఎంతమంది ఉన్నారు.. ఏయే రూంలలో ఉన్నారు.. అనే వివరాలను రిసెప్షన్ వద్ద సేకరించారు. అనంతరం గదుల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. వారి ఆధార్ కార్డులు పరిశీలించి, ఎక్కడి నుంచి వచ్చారు, ఏ పనులపై వచ్చారు, ఎప్పటి నుంచి లాడ్జీలో ఉంటున్నారు తదితర వివరాలను సేకరించారు. ప్రతి ఒక్కరి నుంచి ఆధార్ కార్డు, వారి పూర్తి వివరాలు, అడ్రస్ తెలుసుకున్న తర్వాతే రూమ్‌లు ఇవ్వాలని లాడ్జీల యజమానులకు పోలీసులు సూచించారు.

## ప్రయోజనకరంగా పరిశోధనలు



రక్షితకు డాక్టరేట్ అందిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: పరిశోధనలు సమాజానికి మేలు చేసేలా యూనివర్సిటీ ఆచార్యులు, విద్యార్థులు మరింత సాధన చేయాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థిని టీకె జయరక్షితకు ఏయూ డాక్టరేట్ లభించింది. వీసీ చేతుల మీదుగా ఆమె పీహెచ్‌డీ పట్టా పొందారు. 'ఏ హోలిస్టిక్ అనాలసిస్ ఆఫ్ బనానా ఫైబర్–రీన్ ఫోర్స్‌డ్ సస్టైనబుల్ కాంక్రీట్ ఆఫ్ ఎం 25, అండ్ ఎం 35' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ ఆచార్య ఎస్.ఆదిశేషు పర్యవేక్షణలో ఆమె పరిశోధనలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆదివారం ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జయ రక్షితను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.